

వన్యప్రాణుల విలవిల

వేసవిలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఆశాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా నీటి కోసం అలమటిస్తున్నాయి. 8లో..

అయ్యో పాపం



అప్పుడే పుట్టిన ఆడశిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలివెళ్లారు. ఈ దయనీయ ఘటన భానూర్ – బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. 8లో..

దరఖాస్తుల ఆహ్వానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధిశాఖ అధికారి కవిత తెలిపారు. జిల్లాకు కేటాయించిన రెండు సీట్లకు ఈ నెల 17 నుంచి మే 1 వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మే 4న కలెక్టరేట్‌లో డ్రా తీసి లబ్ధిదారుల ఎంపిక చేస్తారని, వివరాలకు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

రంజాన్ వేళలు

ఆదివారం ఇఫ్తార్	సోమవారం సహర్
సా.6:38	ఉ.4:35

న్యూస్‌రీల్

అండగా ఉంటా: మంత్రి హరీశ్



రమేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: అండగా ఉంటా.. ఆదుకుంటా.. బయపడకండి..అంటూ మంత్రి హరీశ్‌రావు ఓ కుటుంబానికి భరోసానిచ్చారు. సిద్దిపేట పట్టణంలో చిరు వ్యాపారి రమేష్ గౌడ్ అనారోగ్యంతో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు శనివారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు.

ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

గజ్వేల్: ముస్లింల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లో మున్సిపల్ కౌన్సిలర్ ఎం.ఏ రహీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం రంజాన్ పండగకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఏటా ఇఫ్తార్‌ను అధికారికంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మైనార్టీల అభ్యున్నతికి అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ గజ్వేల్ మండల అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

సిద్దిపేటకమాన్: ముందు జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని సిద్దిపేట అగ్నిమాపక అధికారి సుల్తాన్ రాజ్‌కుమార్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికులు, ప్రజలకు అవగాహన కల్పించారు. వేసవిలో విద్యుత్ ఉపకరణాలతో సంబంధించే ప్రమాదాలను ఎలా అరికట్టాలో వివరించారు. సకాలంలో స్పందించే ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక కేంద్ర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉప సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలం చర్లఅంకిరెడ్డిపల్లి ఉప సర్పంచ్ జెల్ల రవీందర్ చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ సభ్యులు తీర్మానం చేశారు. వివరాల్లోకి వెళితే.. గ్రామాభివృద్ధి పనులకు సంబంధించిన చెక్కులపై సంతకాలు పెట్టకుండా ఇబ్బందులు కలిగిస్తున్నాడని సర్పంచ్ స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి శ్రావణ్ రెడ్డిలు ఎంపీఓ సోమిరెడ్డికి ఫిర్యాదు చేశారు. దీంతో శనివారం ఎంపీఓ సోమిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి, మెజారిటీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం నిర్వహించారు. ఈ మేరకు గ్రామస్తుల సమక్షంలో ఉప సర్పంచ్ జెల్ల రవీందర్ చెక్‌పవర్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం 4వ వార్డు సభ్యురాలు గాలిపల్లి లావణ్యకు చెక్ పవర్ అందిస్తున్నట్లు తెలిపారు.

ఉచిత విద్యుత్ అందించాలి

హుస్నాబాద్: విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి ఆదుకోవాలని అఖిల భారతీయ విశ్వకర్మ పరిషత్ కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి సత్యనారాయణ కోరారు. శనివారం సంఘ ముఖ్య నాయకులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో చిన్న యంత్రాలతో వెల్డింగ్, కార్పెంటర్, పిండిగిర్నీ లాంటి వాటిని కుటీర పరిశ్రమలుగా గుర్తించి 200 యూనిట్ల ఉచిత కరెంట్‌ను అందించాలన్నారు. మిగితా యూనిట్లకు ఫోర్త్ కేటగిరి రేట్లకే బిల్లులు తీసుకోవాలని, పట్టణ ప్రాంతాల్లో వివిధ వృత్తులవారికి యూనిట్‌కు రూ.2 చొప్పున వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విశ్వకర్మల డిమాండ్ల సాధనకై త్వరలో నియోజకవర్గ కేంద్రంగా ఆత్మీయ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు దామోదరచారి, కనకాచారి, చంద్రమౌళి, సుదర్శనచారి, సదానందచారి తదితరులు పాల్గొన్నారు.

కీమోథెరపీ ఇక్కడే

కేన్సర్ రోగులకు ఊరట

- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు బెడ్స్‌తో ఏర్పాటు
- త్వరలో ప్రారంభించనున్న మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కీమోథెరపీ సెంటర్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల బలోపేతం దిశగా అడుగులు వేస్తూ ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు విప్లవాత్మక మార్పులు తీసుకువస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు పరిమితమైన కేన్సర్ కీమోథెరపీ సేవలను సిద్దిపేటకు తీసుకువచ్చారు. వ్యాధి భారిన పడిన వారు చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లి లక్షలు ఖర్చు చేయాల్సి వచ్చేది. ఆర్థిక స్తోమత లేక వ్యాధి కంటే బాధతో చనిపోయిన వారి సంఖ్య ఎక్కువగాను ఉంది. వీటికి చెక్ పెట్టేందుకు సిద్దిపేటలో కేన్సర్ చికిత్సను అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రికి కీమో థెరపీ సెంటర్‌ను మంజూరు చేశారు. నాలుగు బెడ్స్‌తో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను మంత్రి హరీశ్‌రావు త్వరలో ప్రారంభించనున్నారు.

మంత్రి హరీశ్‌రావు కృషితో..

- కార్పొరేట్ ఆస్పత్రుల్లో లభించే కేన్సర్ చికిత్స సేవలు త్వరలో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రారంభం కానున్నాయి.
- స్థానికంగా పెద్ద ఆస్పత్రులు లేకపోవడంతో కేన్సర్ చికిత్స కోసం హైదరాబాద్, వరంగల్‌కు వెళ్లాల్సి రావడంతో రోగులు అనేక ఇబ్బందులు పడేవారు.
- కేన్సర్ బాధితులు, వారితోపాటు వెళ్లిన వారు చికిత్స ముగిసే వరకు అక్కడే ఉండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారు.
- ఈ విషయాన్ని గుర్తించిన మంత్రి కేన్సర్ బాధితులకు సిద్దిపేటలో చికిత్స అందించేందుకు కృషి చేశారు.
- ఎంఎన్‌జే, నిమ్స్ ప్రత్యేక వైద్య బృందంతో 4 బెడ్స్‌తో సిద్దిపేటలో కేన్సర్ పేషెంట్స్‌కు కీమోథెరపీ వైద్య సేవలను అందించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.
- కీమోథెరపీ సెంటర్‌లో రోజు ఉదయం 9 గంటల సాయంత్రం 4 గంటల వరకు వైద్య సేవలు అందించనున్నారు.
- కేన్సర్ వ్యాధిగ్రస్తులు మొదట, రెండోసారి నిమ్స్, ఎంఎన్‌జేలో కీమోథెరపీ వైద్య సేవలు పొంది, మూడోసారి నుంచి సిద్దిపేటలో చికిత్స చేయించుకునే అవకాశం ఉంటుంది.
- సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కీమోథెరపీ వైద్య సేవలను రెండు, మూడు రోజుల్లో మంత్రి హరీశ్‌రావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

అన్నీ ఉచితమే

- సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ జనరల్ ఆస్పత్రిలో అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా అందిస్తున్నారు.
- సాధారణ జ్వర లక్షణాలు మొదలు ప్రమాదకరమైన కేన్సర్, గుండె, ఊపిరితిత్తులు, కిడ్నీ వ్యాధులకు ఇక్కడే చికిత్స అందిస్తున్నారు.
- ప్రైవేటు ఆస్పత్రుల్లో కీమోథెరపీకి రూ.10వేల నుంచి రూ.20వేలు ఖర్చవుతాయి.
- ప్రస్తుతం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ వైద్య సేవలు ఉచితంగా లభించనుండడంతో పేద ప్రజలకు ఊరట లభించనుంది.

భరోసా అందించేందుకే..



చనిపోయారని తెలిసి పరామర్శకు వెళితే.. పది మందిలో ఎనిమిది మంది కేన్సర్‌తో కాలం చేశారని తెలిసి చాలా బాధపడ్డా. కేన్సర్‌తో బాధపడుతూ ఆస్పత్రులకు తిరిగి ఆర్థికంగా నష్టపోయిన సందర్భాలు మనసును కదిలించాయి. పేద ప్రజలకు భరోసా అందించేందుకు సిద్దిపేటలో కేన్సర్ వ్యాధి చికిత్సను అందుబాటులోకి తెచ్చాం. ఈ సేవలను పేదలు సద్వినియోగం చేసుకోవాలి.

– మంత్రి హరీశ్‌రావు

బల్దియాను ఆదర్శంగా నిలుపుదాం



సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

సిద్దిపేటజోన్: స్వచ్ఛ సిద్దిపేట సాధించి మున్సిపాలిటీని ఆదర్శంగా నిలిపేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల కోరారు. శనివారం స్వచ్ఛ బడిలో హోం కంపోస్టు తయారీ విధానంపై ఏరఆపటు చేసిన ప్రత్యేక శిక్షణ తరగతులను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రతీ శనివారం స్వచ్ఛ బడిలో 2గంటల పాటు శిక్షణ అందిస్తారని, ప్రతీ ఆర్పీ వారంలో పది మంది చొప్పున వార్డులో ఉన్న మహిళలకు హోం కంపోస్టుపై స్వచ్ఛ బడిలో అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ బడిలో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలను ఆర్పీలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దీప్తి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీష్, వర్క్‌షాప్ ఇన్‌చార్జ్ డాక్టర్ స్వామి, మెప్మా అధికారులు రమ్య, జ్యోతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ పాటించాలి



బెజుగామలో పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు

గజ్వేల్‌రూరల్: పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏడీఏ బాబునాయక్ సూచించారు. మండలంలోని బెజుగామలో రైతు పెంటయ్య వరి పొలాన్ని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం డాక్టర్ సతీష్‌చంద్ర, డాట్ సెంటర్ శాస్త్రవేత్త డాక్టర్ పల్లవి, మండల వ్యవసాయాధికారి నాగరాజుతో కలిసి శనివారం పరిశీలించారు. వరిలో అగ్గి తెగులు లక్షణాలు ఉన్నాయని, దీనితో కంకుల దశలో గోధుమరంగు మచ్చలు ఏర్పడి గింజలు తాలుగా మారుతాయన్నారు. నత్రజని అధిక మోతాదులో వాడినపుడు, గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు, మబ్బులతో కూడిన వాతావరణం ఉండటంతో ఈ తెగులు సోకుతుందన్నారు. దీని నివారణకు ట్రైసైక్లోజోల్ 0.6గ్రాములు లేదా ఐసోప్రొథయోలేన్ 1.5మిల్లీ లీటర్లు లేదా టెబుకోనజోల్‌తో పాటు ట్రిఫాక్సీస్ట్రోబిన్ 0.4 గ్రాములు లీటరు నీటికి కలిపి 15రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు మాధవి, శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



చెల్లాపూర్‌లో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్: వడగండ్ల వానతో పంటలు పూర్తిగా దెబ్బతిని నష్టపోయిన రైతులకు సాయం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. శనివారం దుబ్బాక మున్సిపల్ పరిధి చెల్లాపూర్, మల్లాయపల్లి, బల్వంతాపూర్ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు పంటను చూపిస్తూ.. ఏం ఆశ లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఎమ్మెల్యే వెంటనే రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్, కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌కు ఫోన్ చేశారు. సర్వే చేసి పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. సుమారుగా 2,500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, మామిడి రైతులతో పాటు ఇళ్లు ధ్వంసం అయ్యాయని, బాధిత రైతులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, బీజేపీ నాయకులు తదితరులు ఉన్నారు.

అందరికీ న్యాయం చేస్తాం..

సిద్దిపేటరూరల్: అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు వంగ నాగిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సీతారాంపల్లి, మాచాపూర్, చింతమడక గ్రామాల్లో పర్యటించి, వ్యవసాయాధికారులతో కలిసి పంటలను పరిశీలించారు. వడగండ్లతో నష్టపోయిన మూడు గ్రామాల రైతులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు హంసకేతన్‌రెడ్డి, భాగ్యలక్ష్మి, ఎల్లవ్వ, వ్యవసాయాధికారులు పద్మ, పర్శరాంరెడ్డి, నాయకులు చందర్‌రావు, ఏఈఓ కవిత, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మీయ సమ్మేళనాలతో బీఆర్‌ఎస్‌కు ప్రజాదరణ'

సిద్దిపేటఅర్బన్: బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని సుడా చైర్మన్ రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మిట్టపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సోమవారం మిట్టపల్లిలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని మండలాల్లో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనాలతో ప్రజలకు చేరువయ్యామని అన్నారు. సమ్మేళనానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ సవితా ప్రవీణ్ రెడ్డి, వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, సర్పంచుల ఫోరం అర్బన్ మండల అధ్యక్షుడు కమలాకర్ రావు, కార్యదర్శి రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు తుపాకుల బాల్‌రంగం, ప్రవీణ్ రెడ్డి, సర్పంచులు జయశ్రీ రమేష్, రేణుక, రాజయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్, మండల అధ్యక్షుడు ఎద్దు యాదగిరి, ఎంపీటీసీలు స్రవంతి, రంగం పాల్గొన్నారు.

మల్లన్నసాగర్ ప్రాజెక్టు సందర్శన



మల్లన్న సాగర్ పంప్‌హౌస్ వద్ద జాతీయ మీడియా ప్రతినిధులు

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్‌ను జాతీయ మీడియా ప్రతినిధులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఈఎన్సీ హరిరాం కాళేశ్వరం ప్రాజెక్టు ప్రాముఖ్యతను వివరించారు. మల్లన్న సాగర్ ద్వారా జిల్లాలకు తాగు సాగునీరు అందిస్తున్నారని, ప్రాజెక్టుల నిర్మాణంతో పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. దేశంలో వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచిందని మీడియా ప్రతినిధులకు తెలిపారు. ప్రాజెక్టును పరిశీలించిన మీడియా ప్రతినిధులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వందల కిలోమీటర్ల నుంచి నీళ్లు తెచ్చి నిల్వ చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం మల్లన్న సాగర్ పరిసర గ్రామాల రైతులతో మాట్లాడారు. రిజర్వాయర్ నిర్మాణంతో ఎలాంటి మేలు జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు, ఈఈలు వెంకటేశ్వర్‌రావు, సాయి బాబా, ఏఈ కిరణ్ ఉన్నారు.

ఉపాధ్యాయుల బదిలీలు వెంటనే చేపట్టాలి

టీపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు తిరుపతిరెడ్డి



నిరసన తెలుపుతున్న టీపీటీఎఫ్ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, గత పదో తరగతి సప్లిమెంటరీ వాల్యుయేషన్ డబ్బులను వెంటనే చెల్లించాలని టీపీటీఎఫ్ రాష్ట నాయకుడు తిరుపతి రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పదో తరగతి వాల్యుయేషన్ సెంటర్‌లో భోజన విరామ సమయంలో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతి పత్రం అందించారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయ బదిలీ, ప్రమోషన్లు చేపట్టాలని, స్పాట్‌లో విధులు నిర్వర్తిస్తున్న స్పెషల్ అసిస్టెంట్లకు డీఏ అందించాలని కోరారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజేందర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్, రాష్ట్ర నాయకులు పద్మయ్య, విష్ణువర్ధన్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీఈజేఏసీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్ పీఈజేఏసీ) నాయకులు వీరభద్రయ్య, గంగాధర్, చంద్రారెడ్డి కోరారు. ఈ నెల 17 నుంచి నిర్వహించనున్న సమ్మెకు సంబంధించిన పోస్టర్‌ను శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. వేతన సవరణ చట్టాన్ని అమలు చేయాలని, 1999–2004 ఈపీఎఫ్ నుంచి జీపీఎఫ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 23,660 మంది విద్యుత్ ఉద్యోగులను క్రమబద్ధీకరించినా.. వారికి వేతనాలు పెరగక ఇంకా ఆర్టిజన్లుగానే కొనసాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

రికవరీ అయ్యేనా?

- సీఎంఆర్ ధాన్యం అమ్ముకున్న రైస్ మిల్లర్
- వసూలు చేసేందుకు అధికారుల మల్లగుల్లాలు
- కేసు నమోదైనా.. ఫలితం శూన్యం



హుస్నాబాద్‌లోని ఏఆర్‌ఎం ఆగ్రోఇండస్ట్రీస్

సాక్షి, సిద్దిపేట: సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన మిల్లర్ల నుంచి రికవరీ చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. ఈ నెల 1న హుస్నాబాద్ పట్టణం ఆరెపల్లెలో ఏఆర్‌ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సీఎంఆర్ ధాన్యం నిల్వలపై విజిలెన్స్ టీం తనిఖీలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో రూ 27.76కోట్ల విలువ చేసే 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం మాయమైనట్లు గుర్తించిన అధికారులు రికవరీకి ఆదేశించారు. కేసు నమోదు చేసి రోజులు గడుస్తున్నా.. ఎలాంటి పురోగతి లేకపోవడం విమర్శలకు తావిస్తోంది. డబ్బు చెల్లింపు కోసం మిల్లు యాజమానులపై ఒత్తిడి తెచ్చినా ఎలాంటి స్పందన లేదని తెలిసింది. దీంతో డబ్బులు రికవరీ సాధ్యమయ్యేనా.. అనే సందేహం తలెత్తుతోంది.

రూ.27.76కోట్లు...

- ఏఆర్‌ఎం ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 2021–22 యాసంగి, 2022–23 వానాకాలం సీజన్‌లకు కలిపి 11,426 మెట్రిక్ టన్నుల ధాన్యం సీఎంఆర్ కోసం కేటాయించారు.
- 1,400 మెట్రిక్ టన్నుల ధాన్యం మరాడించి ఇవ్వగా ఇంకా 10,026మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండాలి.
- ఈ నెల 1న మిల్లులో విజిలెన్స్ దాడులు చేయగా 9,522 మెట్రిక్ టన్నుల ధాన్యం లెక్కల్లో తేడాలు ఉన్నట్లు గుర్తించారు.
- పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ హరీశ్ ఫిర్యాదు మేరకు రైస్ మిల్ యజమాని రాంమోహన్‌తో పాటు తిరుమల, అనురాధలపై హుస్నాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.
- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ ఈ నెల 6న కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, సీపీ శ్వేతతో సమావేశమై ఈ ఘటనపై చర్చించారు.
- రైస్ మిల్లు యాజమాన్యం దగ్గర నుంచి రూ27.76కోట్ల డబ్బులను రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ చేశారు.
- మిల్లు యజమానికి చెందిన హుస్నాబాద్ పొట్లపల్లి, వికారాబాద్ జిల్లా తాండూరు, మేడ్చల్ జిల్లాలోని బొడుప్పల్, ఇతర ప్రాంతాల్లో ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు.
- మిల్లు యజమానికి సంబంధించిన ఆస్తులపై క్రయ విక్రయాలు జరగకుండా చూడాలని మండల తహసీల్దార్, సబ్ రిజిస్ట్రార్‌లకు ఇప్పటికే నోటీసులు సైతం పంపించారు.
- ఆయా ఆస్తులన్నిటిపై బ్యాంక్ లోన్‌లు ఉన్నట్లు తెలియడం, బ్యాంక్‌లోన్‌లు ఉంటే రికవరీ సాధ్యం కాకపోవడంతో తో అధికారులు తలలు పట్టుకున్నారు.
- సదరు మిల్లు యాజమాన్యంపై ఇప్పటికి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రాజకీయ పలుకుబడి ఏమైనా ఉపయోగిస్తున్నాడా అనే చర్చసాగుతుంది.
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటేనే మరోమారు ఇలాంటి ఘటనలు జరగవని ప్రజలు చర్చించుకుంటున్నారు.
- జిల్లాలో ఎక్కువ మొత్తంలో సీఎంఆర్ ధాన్యం నిల్వ ఉన్న 25 రైస్ మిల్లులపై పౌరసరఫరాల అధికారులు ఇప్పటికే తనిఖీలు నిర్వహించారు. వాటిలో నిల్వలు సక్రమంగానే ఉన్నట్లు అధికారులు తెలిపారు.

క్లుప్తంగా

ఆర్‌ఎంపీపై ఫిర్యాదు

నర్సాపూర్: తన పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పెద్దచింతకుంటకు చెందిన మహిళకు ఆర్‌ఎంపీ నరేందర్ వరుసకు బాబాయి. ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ ఇవ్వాలని అడగడంతో పాటు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. శనివారం ఉదయం భర్త ఇంట్లో లేనిసమయంలో నరేందర్ మహిళ ఇంటికి వచ్చి ఫోన్ నంబర్ అడగితే ఆమె ఇవ్వనని చెప్పడంతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె తిట్టడంతో వెళ్లిపోయాడు. భర్త ఇంటికిరాగానే విషయ చెప్పింది. సుమారు ఐదేళ్ల క్రితం ఇలాగే ప్రవర్తించాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తనతో పాటు తన కుటుంబ సభ్యులకు నరేందర్‌తో ప్రాణ హాని ఉందని ఆవేదన వ్యక్తం చేసింది. తన పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్‌ఐని కోరింది. ఈ విషయంపై ఎస్‌ఐ శివకుమార్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు వచ్చిందని చెప్పారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు.

సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్స్ దాడులు

తూప్రాన్: పేదలకు పంపిణీ కావల్సిన రేషన్ బియ్యం నిల్వల్లో భారీగా అక్రమాలు చోటు చేసుకున్నట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం గుర్తించారు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని సివిల్ సప్లయి గోడౌన్‌పై విజిలెన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. తనిఖీల్లో 4,743 క్వింటాళ్ల బియ్యం నిల్వల్లో తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందన్నారు. కొన్నేళ్లుగా గోడౌన్ ఇన్‌చార్జిలు పనిచేసిన వారిని అదుపులోకి తీసుకొని విచారించనున్నట్లు తెలిపారు. పటాన్‌చెరులోని తమ ప్రధాన కార్యాలయానికి సోమవారం రావాలని ఆదేశించామన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గతంలోనూ సివిల్ సప్లయి గోడౌన్‌లో అక్రమాలు జరిగిన ఘటనలో ఇన్‌చార్జిలపై అధికారులు వేటు వేసిన సంఘటనలు ఉన్నాయి. అయిన అధికారుల తీరులో మార్పు రాకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.



రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

వన్యప్రాణుల విలవిల

- తాగునీటి కోసం తండ్లాట
- అటవీప్రాంతంలో సాసర్‌పిట్లు, చెక్‌డ్యాంలు ఖాళీ
- నీటి కోసం గ్రామాల్లోకి చొరబడే అవకాశం
- నిధులు రావడంలేదని చేతులెత్తేసిన అటవీశాఖ



పర్వతాపూర్ బీట్‌లో ఖాళీగా సాసర్ పిట్

రామాయంపేట(మెదక్): ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో ఈవేసవిలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఆ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు. ఫలితంగా అవి తాగునీటికోసం అలమటిస్తున్నాయి. దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించిన విలేకరులకు ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు అగుపించాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

- జిల్లా పరిధిలో 58 వేల హెక్టార్లకు పైగా అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో 400 పైగా సాసర్‌పిట్‌లు, చెక్‌డ్యాంలు, కుంటలు ఉన్నాయి.
- వేలాది వన్యప్రాణులు అటవీప్రాంతంలో మనుగడ సాగిస్తున్నాయి. ఏటా వేసవిలో వాటికి తాగునీటి వసతి కల్పించడానికి ఆశాఖ అధికారులు మార్చి మొదటి నుంచే సాసర్ పిట్లు, కుంటల్లో నీరు నింపే చర్యలు తీసుకుంటారు. దీంతో వణ్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా ఉంటాయి.
- గతంలో నీటివసతి కల్పించకపోవడంతో గ్రామాల్లోకి వచ్చి మృత్యువాత పడిన ఉదంతాలు ఉన్నాయి.
- ఐదేళ్ల క్రితం చిరుతలు అడవిని దాటి గ్రామాల్లోకి చొరబడి పశువులపై దాడి చేయడంతో మృత్యువాతపడ్డాయి.
- నీటికోసం అడవి నుంచి వస్తున్న వన్యప్రాణులు ప్రమాదాల బారినపడుతున్నాయి.
- ఐదేళ్ల క్రితం మండల పరిధిలోని కాట్రియాల తండాను ఆనుకునే ఉన్న అటవీప్రాంతంలో జంతువులకు తాగునీటికోసం వసతి కల్పించకపోవడంతో దాహంతో అలమటిస్తూ పదుల సంఖ్యలో వణ్యప్రాణులు మృత్యువాత పడ్డ సంఘటనను «సాక్షి» బయటపెట్టింది.
- దీంతో ఆశాఖ అధికారులు అదనంగా సాసర్ పిట్‌లతోపాటు చెక్‌డ్యాంలు నిర్మించారు. తాజాగా శుక్రవారం సాక్షి ప్రతినిధులు మండల పరిధిలోని దంతేపల్లి, పర్వతాపూర్ అటవీప్రాంతంలో పర్యటించారు.
- ఖాళీగా ఉన్న సాసర్‌పిట్లు కనిపించాయి. వాటిలో చుక్కనీరు కూడా లేకపోగా, చెత్తాచెదారంతో నిండిపోయాయి.
- వీటిని నీటితో నింపితే జంతువులకు తాగునీటి సదుపాయం కలుగుతుందని, లేకపోతే అవి గ్రామాలకు వచ్చే అవకాశం ఉందని ఆయాగ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అటవీ ప్రాంతంలో వన్యప్రాణులకు తాగునీటి వసతి కల్పించే విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. గతంలో సక్రమంగా చెక్‌డ్యాంలు, సాసర్‌పిట్‌లతో నీరు నింపాం. నిధుల కొరతతో ఈసారి కొంత ఆలస్యం జరిగింది. త్వరలో అటవీప్రాంతంలో వణ్యప్రాణులకు పూర్తిస్థాయిలో నీటి వసతి కల్పిస్తాం.

– రవిప్రసాద్, జిల్లా అటవీ అధికారి

అయ్యో 'పాప'ం

- రోడ్డు పక్కన అప్పుడే పుట్టిన ఆడశిశువు
- వదిలి వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు
- ఐసీడీఎస్, పోలీసులకు సమాచారమిచ్చిన స్థానికులు
- సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి శిశువు తరలింపు



గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లిన ఆడశిశువు

పటాన్‌చెరు టౌన్: మానవత్వం రాను రాను మంటగలుస్తోంది. తల్లి పొత్తిళ్లలో వెచ్చగా నిద్రించాల్సిన పసిగుడ్డు అనాథగా మిగిలింది. అప్పుడే పుట్టిన ఆడ శిశువును గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన వదిలి వెళ్లారు. ఈ దయనీయ సంఘటన భానూర్–బీడీఎల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. బీడీఎల్ ఎస్‌ఐ సాయిలు, ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ, సూపర్‌వైజర్ సల్మా తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం క్యాసారం ఎస్సీ కాలనీలో అప్పుడే పుట్టిన ఆడశిశువు రోడ్డు పక్కన శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారు. చిన్నారి ఏడుపు విన్న స్థానికులు వెంటనే ఐసీడీఎస్ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సల్మా, ఎస్‌ఐ సాయిలు సంఘటన స్థలానికి చేరుకొని శిశువును సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పాప ఆరోగ్యంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ముగ్గురి అదృశ్యం



వసంత (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: భార్య కనిపించడంలేదని భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ ప్రసాద్ రావు కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ డీఎస్ కాలనీకి చెందిన శ్రీధర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఈనెల 13వ తేదీన శ్రీధర్ డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాగా భార్య వసంత కనిపించలేదు. అంతేకాకుండా ఆమెకు సంబంధించిన వస్తువులు ఇంట్లో కనిపించలేదు. దీంతో భార్య కోసం తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. భార్య కనిపించడంలేదని శ్రీధర్ పోలీసులు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మి (ఫైల్)

పటాన్‌చెరు టౌన్: తల్లి కనిపించడంలేదని కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శనివారం ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ భాస్కర్ ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. 12వ తేదీన భాస్కర్ తల్లి లక్ష్మి ఇంట్లో గొడవపడి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. డీఎస్ కాలనీలో ఉండే పెద్దమ్మ ఇంటికి వెళ్లి ఉంటుందని కుమారుడు భావించాడు. అక్కడికి వెళ్లగా తల్లి కనిపించలేదు. దీంతో తెలిసిన వారిని, బంధువులను విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. తల్లి కనిపించడంలేదని కుమారుడు భాస్కర్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొనిదర్యాప్తు చేస్తున్నారు.



మహేశ్ (ఫైల్)

నారాయణఖేడ్: గిరిజ బాలుర పాఠశాల విద్యార్థి కనిపించకుండా పోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణఖేడ్ మండలం జూకల్ శివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్ల సమీపంలోని గిరిజ బాలుర గురుకులంలో 9వ తరగతి చదువుతున్న వై.మహేశ్(17) అదృశ్యమైనట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి శనివారం తెలిపారు. శుక్రవారం సాయంత్రం మామిడి కాయల కోసమని గురుకులం ప్రహరీదూకి వెళ్లి తిరిగి రాలేదని ప్రిన్సిపాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసుకుని రెండు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

ప్రిన్సిపాల్ నిలదీత

గురుకులంలో 9వ తరగతి విద్యార్థి మహేశ్ అదృశ్యం కావడంతో శనివారం సాయంత్రం అతడి కుటుంబీకులు ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్‌ను నిలదీశారు. శుక్రవారం అదృశ్యమైతే తమకు ఎందుకు సమాచారం ఇవ్వలేదని ప్రశ్నించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే తమ కుమారుడు అదృశ్యమయ్యాడని ఆరోపించారు.

ఇరువర్గాలపై కేసు నమోదు



దాడి చేసుకుంటున్న బీజేపీ నాయకులు

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండలానికి చెందిన బీజేపీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. పరస్పరం విమర్శలు చేసుకుంటూ దాడికి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూర్గు సురేశ్‌పై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అతడిని పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని ఆయనకు వ్యతిరేకంగా మద్దూరు మండల బీజేవైఎం మండల అధ్యక్షుడు యామా శ్రీకాంత్ సోషల్ మిడియాలో పోస్టులు చేశాడు. దీంతో శుక్రవారం ఉదయం బీజేపీ చేర్యాల మండల ప్రధాన కార్యదర్శి వడ్లకొండ సంజీవులు యామా శ్రీకాంత్‌కు ఫోన్ చేసి పార్టీ నాయకుడిపై ఎందుకు పోస్టింగ్‌లు పెడుతున్నావని ప్రశ్నించాడు. దీనిపై మద్దూరులో మాట్లాడుకుందాం రమ్మని కోరాడు. దీంతో ఇరువర్గాలకు చెందిన కార్యకర్తలు రాత్రి రాత్రి 8గంటకు మద్దూరుకు చేరుకున్నారు. పోస్టింగ్ విషయం గురించి మాట్లాడుతున్న క్రమంలో మాటామటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకునేలోపే ఇరువర్గాలు వెళ్లిపోయాయి. శనివారం ఉదయం యామా శ్రీకాంత్, వడ్లకొండ సంజీవులు పరస్పరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపాడు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల సమస్యలు సృష్టించే వారు ఎవరైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

ఇద్దరి ఆత్మహత్య



ఉప్పలయ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): పురుగుల మందు తాగి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం జరిగింది. ఎస్‌ఐ నారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దూళిమిట్ట మండలంలోని కూటిగల్ గ్రామానికి చెందిన నల్ల ఉప్పలయ(52) రెండో కూతురు వివాహం కోసం తెలిసినవారిని, బంధువులను అప్పు అడిగాడు. ఎవరూ అప్పు ఇవ్వకపోవడంతో తనకున్న 32 గుంటల భూమి అమ్మవలసిన పరిస్థితి రావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడుతాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించాడు. భార్య సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.



శ్రీకాంత్ (ఫైల్)

వర్గల్(గజ్వేల్): మండలంలోని బొర్రగూడెం గ్రామానికి చెందిన యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. బేగంపేట ఎస్‌ఐ అరుణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొర్రగూడెం గ్రామానికి చెందిన బొర్ర భీమయ్య, బాలమణి దంపతులకు కూతురు, ఇద్దరు కుమారుడు శ్రీకాంత్(24), విశ్వనాథ్ ఉన్నారు. శ్రీకాంత్ డీసీఎం డ్రైవర్. శనివారం తమ పొలంలో తండ్రితో కలిసి పని చేశాడు. తరువాత తమ పాత ఇంటిలో మిత్రులతో కలిసి మద్యం తాగాడు. మిత్రులు వెళ్లిన తరువాత ఉరేసుకున్నాడు. అంతకు ముందు శ్రీకాంత్ తన తమ్ముడికి ఫోన్ చేసి మీరంతా బాగుండాలని చెప్పడంతో అనుమానపడి పాతింటి వద్ద చూడగా అన్న ఉరేసుకుని కనిపించాడు. కుటుంబీకులు వెంటనే శ్రీకాంత్‌ను గజ్వేల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధృవీకరించారు. శ్రీకాంత్ ఆత్మహత్య ఘటన వాస్తవమేనని, ఫిర్యాదు అందగానే కేసునమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు. ఆత్మహత్యకు కారణం తెలియాల్సి ఉందన్నారు.

మూడు ట్రాక్టర్లకు నిప్పపెట్టిన దుండగులు

- పొలం పనుల తర్వాత గ్రామ శివారులో ఉంచిన ట్రాక్టర్లు
- తగులబెట్టిన దుండగులు

మెదక్ రూరల్: మూడు ట్రాక్టర్లకు గుర్తుతెలియని దుండగులు నిప్పుపెట్టిన సంఘటన మెదక్ మండలం మల్కాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మల్కాపూర్ తండాలోని పరమేశ్‌కు చెందిన రెండు ట్రాక్టర్లు, గోపాల్‌కు చెందిన ట్రాక్టర్‌ను శనివారం సాయంత్రం పొలం పనులు పూర్తయని తరువాత రాయిన్‌పల్లి శివారు ఎరుకల ఎల్లవ్వ పొలంలో ఉంచి ఇంటికి వెళ్లారు. అదే రోజు రాత్రి 1.30 గంటలకు గుర్తుతెలియని వ్యక్తులు ట్రాక్టర్లకు నిప్పు పెట్టారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చౌర్యం కేసులో నిందితుడి రిమాండ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ అక్రమ వినియోగం కేసులో గజ్వేల్ మండల పరిధిలోని శ్రీగిరిపల్లి గ్రామస్తుడికి రిమాండ్ విధించినట్లు సిద్దిపేట విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు శనివారం తెలిపారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న వడ్డెర ఎల్లంపై మార్చి 13వ తేదీన విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేశారు. శనివారం సిద్దిపేట కోర్టులో హాజరు పరుచగా, కోర్టు ఉత్తర్వుల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు విద్యుత్‌శాఖ విజిలెన్స్ అధికారులు తెలిపారు

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మెదక్ రూరల్: హవేళిఘణాపూర్ మండలం బోగుడ భూపతిపూర్ చెరువులో శనివారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని చెరువులో మృతదేహం ఉన్నట్లు గమనించిన పశువుల కాపరులు సర్పంచ్‌కు సమాచారం ఇచ్చారు. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గేదెను కట్టేయబోయి..

కిందపడి రైతు మృతి



చంద్రయ్య (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): గేదెను కట్టేసే క్రమంలో కిందపడి రైతు మృతి చెందాడు.ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని చంద్లాపూర్ గ్రామానికి చెందిన పుప్పాల చంద్రయ్య(52)కు భార్య బాల్‌లక్ష్మి, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చంద్రయ్యకు బోధకాలు ఉండటంతో తరచూ జ్వరం వస్తుంది. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం చంద్రయ్య గేదెలను పొలం వద్ద కట్టేసి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో అతడి కోసం వెతికారు. పొలం వద్ద కింద పడి కనిపించాడు. గేదెను కట్టేసే క్రమంలో అది గుంజుకుపోవడంతో కింద పడి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు పేర్కొన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

గుండెపోటుతో యువకుడి మృతి



ప్రకాశ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): గుండెపోటుతో యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. శనివారం స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాయపల్లికి చెందిన తాటి ప్రకాశ్(35) వ్యవసాయం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య బాలలక్ష్మి, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పెద్ద కూతురు ప్రణీత తలకొరివి పెట్టింది.

జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం

ముగ్గురికి గాయాలు



గాయపడ్డ డ్రైవర్

రామాయంపేట(మెదక్): నార్సింగి మండలం జప్తిశివనూర్ వద్ద శనివారం కారు చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ముగ్గురు గాయపడ్డారు. బాధితులు విమానాశ్రయం నుంచి కామారెడ్డి జిల్లా కుప్రియాల్ గ్రామానికి వెళ్తుండగా జప్తిశివనూర్ వద్ద కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో డ్రైవర్ శ్రీరాంకు తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వారు తమ స్వగ్రామానికి వెళ్లిపోయారు. ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని నార్సింగి ఎస్‌ఐ నర్సింహులు తెలిపారు.

బాలుడిపై కేసు నమోదు

శివ్వంపేట(నర్సాపూర్): బాలికను కిడ్నాప్ చేసిన కేసులో బాలుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంత్‌రావు శనివారం తెలిపారు. మండల పరిధి గోమారానికి చెందిన బాలిక(16)ను లచ్చిరెడ్డిగూడెంకు చెందిన బాలుడు రెండు రోజుల క్రితం కిడ్నాప్ చేశాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు ఇద్దరు మైనర్లను గుర్తించడం జరిగిందని, బాలికను భరోసా కేంద్రానికి తరలించారు.

చెరువులో మునిగి యువకుడి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామ శివారులోని నల్లకుంటలో వెల్దుర్తి గ్రామానికి చెందిన ఎరుకలి భిక్షపతి(40) నీటమునిగి మృతిచెందాడు. తమ్ముడి పిల్లలను చూడడానికి వెళ్లి మృత్యువాత పడటంతో గ్రామంలో విషాదం నెలకొంది. కుంటలో చేపలు పట్టడానికి వెళ్లి మృతిచెందాడా లేక స్నానానికి వెళ్ళి చేపలకోసం జాలరులు వేసిన వల చుట్టుకొని మృతిచెందాడా అనే అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ విషయమై ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్‌ను వివరణ కోరగా తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

చేపల కోసం విసరిన వలలో చిక్కి..

చిన్నశంకరంపేట(మెదక్): చేపల కోసం విసరిన వలలో చిక్కుకుని మత్స్యకారుడు చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని టి.మాందాపూర్ గ్రామంలో జరిగింది. శనివారం చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టీ.మాందాపూర్ గ్రామానికి చెందిన మాడబోయిన నర్సింహులు(45) శనివారం తెల్లవారుజామున పెద్దచెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపల కోసం విసిరిన వలలో చిక్కుకుని చెరువులో మునిగి మృతి చెందినట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీస్‌లు అక్కడికి చేరుకుని గ్రామస్తుల సహాయంతో చెరువులో గాలించి నర్సింహులు మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న అజారుద్దీన్, పక్కన కత్తి కార్తీక

దుబ్బాకటౌన్: కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని, రాష్ట్రంలో అధికారంలోకి రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ క్రికెటర్ అజారుద్దీన్ అన్నారు. శనివారం దుబ్బాకలో కాంగ్రెస్ నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఇఫ్తార్ విందులో మాట్లాడారు. తెలంగాణలో నిరంకుశ పాలనకు ప్రజలు చరమగీతం పాడేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటుందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొత్త దేవిరెడ్డి, మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- సిద్దిపేట సీపీ శ్వేత
- మూడు నేరాల వివరాలు మీడియాకు వెల్లడి

సిద్దిపేటకమాన్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండా ని సిద్దిపేట సీపీ శ్వేత అన్నారు. సిద్దిపేట పట్టణంలో సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయి డబ్బులు పొగొట్టుకున్నారు. సీపీ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ట్రేడింగ్ టెలిగ్రామ్ యాప్‌లో డబ్బులు పెట్టుబడిగా పెడితే రెట్టింపు లాభాలు వస్తాయని నమ్మబలికాడు. అది నమ్మిన బాధితుడు రూ.12వేలు ఆన్‌లైన్‌లో పెట్టుబడిగా పెట్టాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో తాను మోసపోయినట్లు గ్రహించి వెంటనే జాతీయ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫిర్యాదు చేశాడు.

హోటల్‌లో రూమ్ కోసం..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తి బెంగుళూరులోని ఓ హోటల్‌లో రూమ్ బుక్ చేసుకోవడానికి ఆన్‌లైన్‌లో హోటల్ నంబర్ వెతికాడు. ఆన్‌లైన్లో కనిపించిన నంబర్‌కు ఫోన్ చేయగా అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని సూచించాడు. దీంతో బాధితుడు ఆన్‌లైన్‌లో గుర్తు తెలియని వ్యక్తి సూచించిన నంబర్‌కు రూ.19,010 పంపించాడు. తర్వాత ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ రావడంతో జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

ఆర్మీ జవాన్ పేరుతో ..

పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి ఆర్మీ జవాన్ అంటూ పరిచయం చేసుకున్నాడు. అతడికి ఆయుర్వేద మందులు కావాలని డబ్బులు పంపిస్తానని నమ్మించాడు. బాధితుడు డబ్బులు వస్తాయని ఆశపడి సైబర్ నేరగాడు సూచించిన విధంగా పేటీఎం యాప్‌లో ఓటీపీ వివరాలు నమోదు చేయడంతో తన ఖాతా నుంచి రూ.12,999 డబ్బులు డెబిట్ అయినట్లు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో బాధితుడు జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేశాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగినికి బురిడీ

పటాన్‌చెరు టౌన్: పార్ట్ టైం జాబ్ ఆఫర్ అంటూ అపరిచిత వ్యక్తి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెద్దమొత్తంలో నగదు పోగొట్టుకుంది. ఈ ఘటన అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పరిధిలోని ఓ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని రచనకి ఈనెల 8వ తేదీన వాట్సాప్ ద్వారా పార్ట్ టైం ఉద్యోగం అంటూ మెసేజ్ రావడంతో లింక్ క్లిక్ చేసింది. దీంతో టెలిగ్రామ్ ద్వారా ఓ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. బాధితురాలు వారు చెప్పిన విధంగా వివరాలను నమోదు చేసింది. మెదట రూ.వెయ్యి నుంచి ఇన్వెస్ట్ చేస్తూ, వారు చెప్పిన విధంగా టాస్క్‌లు చేస్తూ, పలు దఫాలుగా మొత్తం రూ.8.35 లక్షల నగదును ఇన్వెస్ట్ చేసింది. ఇన్వెస్ట్ చేసిన నగదును ఒకేసారి డ్రా చేసుకోవచ్చని చెప్పి నమ్మబలికారు. కమీషన్ తో పాటు పెట్టిన నగదును ఇవ్వాలని బాధితురాలు అడగటంతో అతడె స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించిన రచన ముందుగా సైబర్ క్రైం లో ఫిర్యాదు చేసి, అనంతరం అమీన్‌పూర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.